

కథా కౌముది

# 'ఇరు ... మా' - నిర్మలాదిత్య

**శ్రీ విళంబి నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**23వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**ఉత్తమ కథానిక విభాగం - ప్రశంసా పత్రం**

'ఇరు మా',

అన్నది సీత, మాటలు త్రుంచి విస, విస వెళ్లిపోవాలన్న ఆదృత, వనిత ముఖంలో చూసి.

'అబ్బే, వెళ్ళాలి ఆంటీ. పాపని బాలే క్లాస్ నుంచి, బాబుని ఫుట్బాల్ ప్రాక్టీస్ నుంచి పిక్ అప్ చేయాలి', వనిత, సీతకు చేయి ఊపేసి, వడి వడి గా ఒక్కింత రిలీఫ్ తో తన సాయం కాలం జాగింగ్ తిరిగి మొదలుపెట్టింది.

విశ్వం ఆపుకోలేకుండా నవ్వసాగాడు. విశ్వం నవ్వుతాడాని ఓ క్షణం ముందే అనుకున్న సీత 'ఇక ఆపండి మీ నవ్వు', రాని కోపాన్ని ముఖంలో పులుముకొని చెప్పింది.

40 ఏళ్ళు కలసి జీవించిన తరువాత, కోపం తెచుకోవడం కష్టమే. అదీ సీత, విశ్వం ల లాగా ఉన్నవారికి. వారి అన్యోన్యత, ఏళ్ళు గడిచే కొలది ఎక్కువవుతూనే ఉంది. విశ్వం దానికి కారణం ఇద్దరూ కృషి చేయడం అనుకుంటాడు. సీత భగవంతుడిచ్చిన వరం అనుకుంటుంది. సీత పెద్ద కుటుంబంలో నుంచి రావడం వల్ల చుట్టూ మనుష్యులు ఉండాలని కోరుకుంటుంది. పిల్లలతో ఆడుకోవడం మరీ ఇష్టం. విశ్వం ని నమ్ముకొని ఆ ఊరు ఈ ఊరు అని చివరకు దేశాలు తిరిగి, అదిగో ఈ ఫ్లొరిడా లో స్థిరపడ్డారు. సముద్రం ఒడ్డున, ఎక్కడ చూసినా, పచ్చదనం, హైదరాబాదు సంక్రాంతిని గుర్తుకు తెచ్చే అటు చలి, ఇటు వేడి కానీ వాతావరణం, ముఖ్యంగా స్నో పడకపోవడం, సీత విశ్వంలకి నచ్చింది. దానికి తగట్టు తామున్న కమ్యూనిటీ లో , చిన్న చిన్న కొలనులు, వాటి చుట్టూ ఇళ్ళు, పచ్చిక బయళ్లు, పాల్మ్ , పూలు పూసే మాగ్నోలియా, క్రెప్ మిర్ టల్ చెట్లు, జాగింగ్, వాకింగ్ కని మలుపులు తిరుగుతూ అన్ని ఇండ్లను కలుపుతున్న కాలి దారులు, వారికి నచ్చే ప్రశాంతత

ప్రసాదించింది. అలాంటి కమ్యూనిటీ లో తెలుగు వారు, తమిళులు చాలా మందే ఉండడం సీతకు మరీ నచ్చింది. సీత తమిళ నాడు లో పెరిగిన వారి పూర్వికులు తెలుగు వారు కావడంతో ఇంట్లో తెలుగులోనే మాట్లాడుతారు. ఆ తెలుగుకి కొంత తమిళ సువాసనలు అబ్బడంలో ఆశ్చర్యంలేదు. అందుకే ఉండమన దానికి సీత 'ఇరు మా' అంటే విశ్వం కు ముద్దే. అలాంటి తెలుగు తమిళ మిళిత పదాలు విని విశ్వం మొదట్లో సీతను, ఆట పట్టించినా, ఆ పదాల వెనకున్న ప్రవాసాంధ్రులు భాషా మమతని చూసి, వాటిని అభిమానించ కుండ లేక పోయాడు.

సాయంకాలంలో, అలా కాలి దారిన కమ్యూనిటీ అంతా ఓ రెండు మైళ్ళు నడవడం, వెలుగుంటే ఇంటి బయట పూల మొక్కలు, పొదలు ట్రిమ్ చేయడం, ఆ తోట పని చేస్తున్నప్పుడు కాలి దారిన పోతున్న వారితో, హాయ్ అని పలకరించడం, తెలిసిన వారైతే కబుర్లు వేసుకోవడం సీతకు అలవాటు. విశ్వం సీతతో పాటు ఉన్నా పలకరిస్తే కానీ పలకడు. ఓ ప్రశాంతతో కలిసిన చిరు నవ్వు మటుకు ముఖంలో వెలుగుతూనే ఉంటుంది.

పడమట సూర్యుడు ఎట్టటి అందాలు ఆకాశంలో పులుముతున్న అలాంటి ఓ అందమైన సంధ్య వేళనే, వనిత సీతకు తటస్థ పడింది.

కానీ చుట్టూ ఉన్న ప్రకృతి అందాలు సీతకు ఎప్పటి లాగా ఆనందాన్ని కలుగచేయలేదు. వనిత ఆగకుండా వెలిపోయిందే అన్న వెలితి, సీత ముఖంలో అట్టే పెట్టేసాడు విశ్వం.

'వనిత వాళ్ళాయనని ఇంటికి పంప మనే కదా, వనితతో చెప్పాలనుకున్నావు. అది ఊహించే పారిపోయింది వనిత', నవ్వేసాడు విశ్వం.

'అదేం కాదు. వాళ్ళ బిడ్డల్ని తీసుకొని రావాలంట. తీరుగా ఫోన్ చేస్తాను లెండి', అంది సీత ఒక్కింత ఉడుక్కుంటూనే.

'కర్టెన్ రాడ్, వేయడమే కదా, నేను వేసేస్తాను', ఎందుకు అవస్థ పడతావు', అనునయంగా అన్నాడు విశ్వం.

ఇక్కడ స్థిర పడిన అందరి లాగే, విశ్వం కూడా ఇంటి పనులన్నీ చేసుకోవడానికి అలవాటు పడిపోయాడు. చిన్న చిన్న ప్లంబింగ్, ఎలక్ట్రిక్, లాండ్స్కేపింగ్ పనులు చక చక చేయగలడు. ఆ పనుల కని, కావాల్సిన, పనిముట్లు గ్యారేజ్ లో చాలానే ఉన్నాయి. 'హోం డిపో' లో షాపింగ్ చేస్తున్నంత హుషారు 'మేసీస్' లో ఉండదేమి అన్న ఆలోచన, కొంచెం జెండర్ బయాస్ చూపెట్టిన్నా, విశ్వం విషయంలో నిజమే.

వయస్సులో ఉన్నప్పుడు, ఎన్ని సర్కస్ ఫీట్లు చేసినా పరవాలేదు, 70 ఏళ్ళు దాటిన తరువాత అవసరమా, ఎవరైనా హాండీ మాన్ ను పిలిపిద్దామని సీత ప్రయత్నం. కర్టెన్ రాడ్ మొన్ననే పడిపోయింది. నిచ్చెన వేసుకొని ఎక్కి, ఎల్ ట్రిక్ డ్రిల్ తో, స్క్రూలు బిగించాలి. చిన్న పనే కదా అని, తెలిసిన వారి సహాయం కోసం సీత వనిత కనిపిస్తూనే అడిగింది. ఇలాంటి పనులేవో తగుల్తాయి అన్న సిక్స్త్ సెన్స్ బాగా పెంచుకున్న యువ తరం, వనిత లాగా, సీత కందకుండా జారుకుంటున్నారు.

విశ్వం కు సీతను చూస్తే జాలి, అంతకు మించి ఉద్వేగమైన ప్రేమ కలిగింది.

'ఎందుకు అవస్థ పడతావు సీత, ఇద్దరం మంచి ఆరోగ్యంగానే ఉన్నాం, రోజు కావలసినంత వ్యాయామం చేస్తున్నాం, కర్టెన్ రాడే గా, చిటికెలో బిగించేద్దాం. కావాలంటే నిచ్చెన పక్కనే నీవు నిల బడు' అంటూ విశ్వం గరాజి లోనుంచీ నిచ్చెన ఇంటిలోకి తీసు కెళ్లాడు. సీత ఎలక్ట్రిక్ డ్రిల్, టూల్ కిట్ తీసుకొని విశ్వంను అనుసరించింది. ఓ ఐదు నిముషాల్లో విశ్వం సీత పని ముట్లు అందిస్తూ ఉంటే రాడ్ బిగించేశాడు.

'ఈ పనికే, ఎందుకు వాళ్ళని వీళ్ళని అడుక్కుంటావు', సీతతో మెత్తగానే చెప్పాడు విశ్వం.

'మీరు పడబోతారని భయం. నాను ఏమి చేస్తును?' అంది సీత.

విశ్వం కు సీత కళ్ళు చెమ్మగిల్లాయనిపించింది. సీత భజం పై చేయి వేసి మెత్తగా నొక్కాడు విశ్వం.

గరాజీలో సామాన్లు తిరిగి పెట్టేసి, గరాజి తలుపు మూసి, ఇంట్లోకి వస్తుంటే, ఫోన్ మ్రోగింది.

లక్ష్మీ నుంచి. వాళ్ళాయన మాధవ్ ట్రావెల్ జాబ్ అంటూ వారంలో ఓ శని ఆది వారాలు మాత్రం ఇంట్లో ఉంటాడు.

'విన్నారా ఆంటీ... 'ఇర్మ' తుఫాను ఫ్లోరిడా వైపు వస్తున్నాదట', అంది లక్ష్మి.

'అవును టివిలో చూస్తిని. ఫ్లోరిడా నిండా తుఫాను నేలే కదా లక్ష్మీ', అప్పటికే జనాల హడావిడి టివిలో చూసిన సీత అంది.

'ఈ సారి తుఫాను మన ఊరి వైపే వస్తున్నదట. గ్రాసారీ స్టోర్ కి వెళ్ళారా. అనీ అరలు ఖాలీనే. నీళ్ల కేన్లు, బేటరీలు, పాలు, తిండి కేన్లు, అన్నీ ఖాళీనే. '

'స్టోర్ కి పోలా. ఇంట్లో ఉన్నదాంట్లో సరిపెట్టుకోవచ్చు. ఎందుకు అవసరం. రెండు రోజుల కంటే ఎక్కువ తుఫాను ఉండదు. బిన్నే, మనోళ్లు బెదిరిపోతావుండారు', నవ్వుతూ అంది లక్ష్మీ.

'సి ఎన్ ఎన్ చూడండి, బర్బుడా ద్వీపంలో ఇండ్లు అన్ని అగ్గిపెట్టెల లాగా ద్వంసం అయ్యిపోయాయి. మా కజిన్ అట్లాంటా లో ఉంటున్నారు. మేము రేపు కారులో పోతున్నాము. మీరు వస్తారా? ఇప్పటికే అట్లాంటా వరకు రోడ్డు పక్కనున్న మోటల్స్ అన్ని బుక్ అయ్యిపోయాయి. మీరు త్వర పడండి', అంది లక్ష్మీ

'విశ్వం తో మాటలాడి తిరుగా ఫోన్ చేస్తా లక్ష్మీ', అని సీత ఫోన్ పెట్టేసింది.

సీత విశ్వం కు చెప్పుదామనేసరికి, విశ్వం టీవీ లో ఇర్మ పై వస్తున్న వార్తలను చూస్తున్నాడు. సీత లక్ష్మి చెప్పిన విషయాలూ చెప్పి, మనమూ బయలు దేరుదామా...మోటల్స్ చూడండి అని చెప్పింది.

విశ్వం, ' సీతా, గత రెండు రోజులూ, ఈ తూఫాను గురించి వింటూనే ఉన్నా. అది మన ఊరు వైపు వచ్చినా, మన ఉన్న ఇల్లు కొత్తది. బిల్డింగ్ కోడ్లు మార్చారు. మన ఇల్లు ఇలాంటి తుఫానులు తట్టుకో గలవు. అసలు అలా కార్లు పట్టుకొని , పోతున్నవారితో, హైవేయలే జామ్ అయ్యిపోతున్నాయట. తెలిసిన మనింట్లో ఉండడం కంటే ఇలా రోడ్లు పట్టుకొని, బిల్డింగ్ గట్టిదనం తెలియని, మోటల్స్ వెదుక్కోవడం ప్రమాదకరం అనిపిస్తుంది. నా మాట నమ్ము. అంతా రీసెర్చ్ చేసా. ఇంట్లో అన్ని వస్తువులున్నాయి. వి ఆర్ గుడ్', సీత భుజం నొక్కాడు.

మరుసటి రోజు సీత లక్ష్మి కి రావడంలేదని చెప్తుండగానే విశ్వంకు సురేష్ నుండి ఫోన్ వచ్చింది. తమ వరుసలోనే సురేష్ వాళ్లకు ఇల్లు ఉంది. కెనడా సిటీజన్షిప్ ఉంది. ఇక్కడ తాత్కాలిక వీసా పైన పని చేస్తున్నాడు.

' విశ్వం గారు ఇర్మా వార్తలు చూస్తున్నారు కదండి. బ్రిటిష్ వర్జిన్ ద్వీపాల లో మొత్తం ఇల్లు కూలి పోయాయి. ఫ్లైట్స్ చూసాను. డొమెస్టిక్ టికెట్లు ఇంకో మూడు రోజులు దొరకడం లేదు. అదృష్టవశాత్తు, కెనడాకు దొరుకుతున్నాయి. మీరు ఇక్కడే ఉండ దలచుకున్నారని, వాట్స్ అప్ మెస్సేజిలో చూసా. కొంచెం మా ఇల్లు చూసుకోండి' అని చెప్పి హడావిడిగా ఫోను పెట్టేసాడు.

విశ్వం తాము ఉండడానికి తీసుకున్న నిర్ణయం వెనకాల ఉన్న విషయాల గురించి చెప్పి, కొంత మందిని ఒప్పించే ప్రయత్నం చేసినా, లాభం లేక పోయింది. ఫేస్ బుక్, వాట్స్ అప్, టీవీ , ఇండియానుంచి బంధు జనాల ఘోషతో I-75, I-95, ఫ్లోరిడా టర్న్ పైక్ హైవేల పైన బంపర్ టు బంపర్ ట్రాఫిక్.

విశ్వం ఉన్న వీధిలో ఉన్న తెలిసిన తెలుగు, గుజరాతీ, తమిళ కన్నడ వారు అట్లాంటా, మెంఫిస్, షార్లెట్, అంటూ గంటలకొద్దీ, పిల్ల పాపాలతో, రోడ్ల మీద డ్రైవ్ చేయడం మొదలెట్టారు. చాలామంది, ఓ పది కేన్ల గ్యాస్ కూడా డిక్కీలలో పెట్టుకున్నారు. గ్యాస్ దొరకదన్న ఆత్రుతతో కావలసిన దానికి మించి కొనడం, పోలోమని ఇలా ఇన్ని కార్లు రోడ్డు మీదకి రావడంతో నిజంగానే గ్యాస్ స్టేషన్ లన్నీ మూత పడిపోయాయి. గ్యాస్ అయ్యి ఆగిపోయిన కార్లతో, హైవేలు మరింత గందరగోళం గా తయారు అయ్యాయి.

'అందరూ పోయిడ్సి నారు.ఇంటి ఎదురంగా ఆ వనితా, ప్రశాంత్ వాళ్ళ ఫామిలీ దా ఉండారు. విశ్వం మనం చేసేది సరిదానా', కొంచెం సంశయం గానే అడిగింది సీత.

' ప్రసాద్ వాళ్లు కాక ఆ మూడో ఇంట్లో ఎడ్ వాళ్ళుంటున్నారు. ఎడ్ తో మాట్లాడాను. తను కూడా ఇక్కడ ఉండడమే సేఫ్ అన్నాడు. మనం ఎవాక్యూషన్ జోన్ లో లేము. మన దగ్గరున్న స్కూల్స్ అన్నీ షెల్టర్ లు లాగా మార్చేశారు. ట్రైలర్స్ లో ఉన్న వారు, ఇల్లు లేని వారందరు షెల్టర్ కు పోతున్నారు. మనం ఎత్తు ప్రదేశంలో ఉన్నాం. నీటి వరద భయం లేదు. ఇళ్లను గట్టిగా ఇలాంటి తుఫానుకు తట్టుకునే లాగా కట్టారు. వి ఆర్ సేఫ్', విశ్వం అన్నాడు.

మరుసటి రోజే ఇర్మా ఫ్లోరిడా నేల పై అడుగిడుతుంది. విశ్వం సీత లు బయట లాన్‌లో ఉన్న ఔట్డోర్ ఫర్నిచర్ అంతా ఇంట్లోకి తరలించారు.

రేపు రాత్రి నిద్ర ఉంటుందో లేదో అని తొందరగానే ఆ రోజు పడక చేరారు, విశ్వం సీతలు. సీతకు నిద్ర పట్టడం లేదు. గత కొద్ది రోజులుగా మీరు కూడా ఇల్లు వెకేట్ చేసి ఎక్కడికో ఒకచోటికి ప్రాణాలు గుపెట్టిలో పెట్టుకొని పారిపోండి అన్న పీర్ ప్రెషర్ పెరిగి పోయింది.

విశ్వం తప్పుచేయడని నమ్మకం. జీవితంలో ఇంత దూరం ప్రయాణం చేసిన తరువాత వచ్చే మైండ్ సెట్ కూడా కారణం కావచ్చు. ఆ విషయాలు మాట్లాడుకుంటూనే నిద్రలో జారుకున్నారు.

పొద్దున్నే ఫోన్ మ్రోగింది. విశ్వం ఫోన్ తీసుకున్నాడు.

ప్రశాంత్ నుంచి.

' విశ్వం గారు గుడ్ మార్నింగ్. నిద్ర లేపానా..సారీ అండి.కొంచెం కారు రైడు కావాలి. మా ఆఫీస్ స్నేహితులు ఫోన్ చేశారు. మన కౌంటీ బడిని నిన్ననే మరో షెల్టర్ గా తెరిచారు. రాత్రే పోయి మా ఫ్రెండ్స్ తో సహా రిజిస్టర్ చేసాను. అక్కడ పార్కింగ్ స్పేసు లేదు. ప్లీజ్ మీరు డ్రాప్ చేయండి. ఇంకా ఓపెనింగ్స్ ఉంటే మీరు షెల్టర్కు మారొచ్చు'

'అరే, మీరుంటారనుకున్నాం ప్రశాంత్. మీరు వెళ్లి పోతున్నారా? మనం ఇక్కడ మన ఇండ్లలో ఉండడం సేఫ్ కదా. షెల్టర్ దేనికి. ఇండ్లు లేని వారు, ట్రైలర్ లాంటి నిలకడ లేని ఇండ్లలో ఉండేవారు, ఫ్లడ్ జోన్ లో ఉండే వారికి షెల్టర్,' అన్నాడు విశ్వం.

ప్రశాంత్ ఇబ్బందిగా నవ్వుతూ,' ఉండాలనే అనుకున్నాం విశ్వం గారు. కానీ చూశారుగా, ఇర్మా దారి మారింది. ఇప్పుడు ఫ్లోరిడా పశ్చిమ తీరం తాకుతుంది అంటున్నారు. ఇప్పటికే, క్యూబా, బహమ ద్వీపాలలో అంతు లేని నష్టం కలిగించింది. ఇండియా నుంచి మా బంధువులు, ఇక్కడ మా స్నేహితులు ఒకటే గొడవ. ఇక ఇప్పుడు అట్లాంటా అలా పోవడం కుదరదు. షెల్టర్ లో మన వారు చాలా మంది నిన్ననే చేరిపోయారు. తిండి కూడా అక్కడే పెడుతున్నారట. వంట వండాల్సిన పని కూడా లేదు. హాయిగా కార్డు గేమ్స్, కబుర్లు చెప్పుకుంటూ, టైం పాస్ చేసుకోవచ్చు. మీరు రండి' అన్నాడు.

పది నిముషాలు ఇవ్వమని, సీత కు విషయం చెప్పండంతో, ఇద్దరూ ప్రశాంత్ వాళ్ళ కుటుంబాన్ని షెల్టర్లో డ్రాప్ చేయడానికి తయారయ్యారు. విశ్వం వాన్ తీసుకొని, ప్రశాంత్ , వాళ్ళావిడ, ఇద్దరు పిల్లలు, వారి తో తెచ్చుకున్న కొన్ని బ్యాగులు వాన్ లో సర్దుకోగా షెల్టర్ కు బయలు దేరారు. దగ్గరే ఉంది షెల్టర్. పది నిమిషాలు కూడా పట్టలేదు. పార్కింగ్ నిండి పోయింది. సీతనే డ్రైవ్ చేస్తుండంతో , సీతను అలాగే రన్నింగ్ లో ఉండమని, విశ్వం ప్రశాంత్ వాళ్లకు తోడుగా షెల్టర్ కి వెళ్ళాడు. ప్రశాంత్ అప్పటికే రిజిస్టర్ అయ్యి ఉండడం తో వెంటనే లోపలికి వెళ్ళి పోగలిగాడు.

' మీరు రిజిస్టర్ చేసుకొని మాతో పాటే వచ్చేయండి విశ్వం గారు', అంటూ ఇంకా షెల్టర్ కోసం లైన్లో నిలబడిన వరుస వైపు చూపెట్టాడు.

'ఓహ్ నో ప్రశాంత్. నేను నా హోమ్ వర్క్ ముందే చేసుకున్న. వి ఆర్ సేఫ్ అట్ ఔర్ హోమ్. మా ఇంట్లోనే ఉంటాం. మీకు ఇక్కడ నచ్చక పోతే, మా ఇంటికి మీరే వచ్చేయండి. కలసి ఉండొచ్చు. టేక్ కేర్', అంటూ విశ్వం వీడ్కోలు తీసుకున్నాడు.

షెల్టర్ బయటకి వస్తే ఓ గొప్ప ప్రశాంతత. ఎంతో నిశ్శబ్దన్గా అనిపించింది. పక్షులు అరవడం లేదేందుకో అనుకున్నాడు విశ్వం, నవ్వుతున్న సీత కళ్ళలో కళ్ళు కలిపి. అప్రయత్నంగా విశ్వం పెదవుల పైన చిరు నవ్వు వచ్చేసింది. సీత పక్కనుంటే చాలు, తుఫాను లో కొట్టుకొని పోయినా, నవ్వుతూ నే పోవచ్చు. సీత ఉన్న వాన్ వైపు దారి తీస్తుంటే, వాన్ వెనుకనున్న ట్రక్ దగ్గిర ఓ హిస్పానిక్ కుటుంబం విశ్వానికి కనబడింది. ఓ నలభై వయస్సు ఉన్నతను, కుటుంబ పెద్ద ఉండొచ్చు, ఏదో హడావిడిగా భార్య తో నేమో చెప్తున్నాడు. ఆవిడ పక్కనే కూర్చున్న ఇద్దరి చిన్న అమ్మాయిలు ఓ 10 ఏండ్లు ఉంటాయేమో, కూడా వర్రీడ్ గా కనిపించారు . విశ్వం అప్రయత్నం గా సీత ను ఆగమని చేత్తో సంజ్ఞ చేస్తూ, ఆ ట్రక్ దగ్గరున్న అతని దగ్గరికి వెళ్ళాడు.

'హలో, అనీథింగ్ ఐ కెన్ హెల్ప్?', ముందు చిన్న పిల్లల తో కళ్ళు కలిపి, తరువాత ఆ పిల్లల అమ్మ, ట్రక్ దగ్గరున్న మనిషిని ఉద్దేశించి, నవ్వుతూ అడిగాడు.

' ఓహ్ షెల్టర్ ఐస్ ఫుల్, నీడ్ టు ఫైండ్ అనొథెర్', నవ్వుతూ సమాధానం ఇస్తున్నా, ముఖం లో కలవరం ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

' చెప్తూనే ఉన్నా. నిన్న తన పని నుండి వచ్చేసరికి అర్ధ రాత్రి దాటింది', వాళ్ళావిడ విశ్వంతో అంది. తను బిల్డింగ్ కాంట్రాక్టర్ అని, తుఫాను దెబ్బతో షట్టర్స్ వేయడం లాంటి పని బాగా దొరికింది, అందుకే ఆలస్యమైంది. కానీ ఇదివరకు షెలెటర్లలో స్థలం సులభంగా దొరికేది. ఈసారి అన్ని ఫుల్ అయ్యిపోయాయి అంటూ విశ్వంతో వాపోయాడు.

ప్రశాంత్ లాంటి వారు కారణమా? తుఫానుకు తట్టుకోగల ఇండ్లు ఉన్న ప్రశాంత్ లాంటి వారు, ఇలా సరైన ఇండ్లు లేని వారి కోసం ఏర్పాటు చేసిన షెల్టర్ వెదుక్కోవడం, తప్పని పించింది. కానీ ఎవరి నిర్ణయాలు వారివి. వాటికవే సరి అయ్యినవి.

అప్పుడే పరిచయం అయ్యిన వ్యక్తి హోసే అని, ఆయన భార్య జెన్నిఫర్, ఇద్దరు అమ్మాయిలు ఫ్లోరా, ఫియోన అని పరిచయం చేశాడు. అమ్మాయిలు ఇద్దరు కవలలు అని వారి అచ్చు గుద్దిన ఒకే ముఖాలు చెప్పేసాయి. విశ్వం ఎందుకో ఆ కుటుంబం చూస్తూనే ఆప్యాయత కలిగింది. గెట్టింగ్ కనెక్టెడ్ అంటే అర్థం అదే నెమో. మీకు షెల్టర్ లేకపోతే, మాతో బాటు ఉండండి అని విశ్వం హోసే తో అన్నాడు. విశ్వం ఉన్న కమ్యూనిటీ పేరు చెప్పాడు.

హోసే తను ఆ ఇండ్లు రెండేళ్ల క్రితం కట్టినప్పుడు పనిచేశానని, ఈ తుఫానుకు మంచి తలదాచుకునే ప్రదేశమేనని వెంటనే విశ్వంతో వాళ్ళింటికి రావడానికి ఒప్పుకున్నాడు. పదే పదే థాంక్స్ కూడా చెప్పాడు.

సీతను అడగకుండానే మాట ఇచ్చాను అయినా సీతకు మనుష్యులు కావాలి, తప్పక ఒప్పుకుంటుంది అన్న నమ్మకంతో సీత తో మాట్లాడడానికి వాన్ వైపు దారి తీశాడు విశ్వం. హోసేకు తమ వాన్ చూపట్టి, ఫాలో కామన్నాడు.

సీత, ' ఎనదా పేచీ. నిండా లేటు చేసినారు', అంది విశ్వంతో.

విశ్వం హోసే , హోసే భార్య పిల్లల గురించి చెప్పాడు. తుఫాన్ సమయంలో తమ ఇంట్లో తల దాచుకుంటారని చెప్పాడు. సీతకు ఇల్లు జనాలతో గలగల లాడుతుండడం తెగ ఇష్టం. పైగా కవల అమ్మాయిలు కూడా వస్తున్నారంటే తెగ సంబర పడిపోయింది. విశ్వం ఇంట్లో 3 కార్లు పెట్టే సదుపాయం ఉండడంతో, హోసే తన ట్రక్ కూడా గరాజి లోనే పెట్టేసాడు.

ఇల్లు చేరిన తరువాత సీతకు హోసే, జెన్నిఫర్, ఫ్లోరా, ఫియోన లను పరిచయం చేశాడు ముందు ఓ అరగంట కొంచెం మొహమాటంగా ఉన్నా, సీత, విశ్వం ల ఆప్యాయత అతిధి మర్యాదలు చూసి, సుపరిచతులు లాగా, ఇంట్లో మనుష్యులు లాగా మారిపోయారు. ఫ్లోరా, ఫియోనాలు సీతను వదలడం లేదు. అందుకు తగ్గట్లు, సీత కూడా కబుర్లు చెప్తూ, ఆటలు ఆడిస్తూ జెన్నిఫర్ తోను పిల్లతోను నవ్వుతూనే ఉంది. హోసే, విశ్వం టి వి ముందు సోఫాట కూర్చుని ఇర్మా లేటెస్ట్ వివరాలు చూస్తున్నారు. నేపుల్స్ దగ్గర ల్యాండ్ ఫాల్ అంటున్నారు. టి వి లో చూపెడుతున్న దృశ్యాలు కొంచెం భయాంకరంగానే ఉన్నాయి. ఒకటే గాలి. కొబ్బరి, పామ్ చెట్ల ఆకులు మట్టలతో సహా ఒక వైపు వైపోయి ఒదిగి పోయి, చింపిరి జుట్టున్న జడ కర్ర అమ్మాయిలను గుర్తింపు చేస్తున్నాయి. రోడ్డు పక్క పార్కింగ్ చేసిన కార్లు . మునిగి పోతున్నాయి. ఓ పది నిమిషాల తరువాత, విశ్వం ఇంటి బయటకి వచ్చి ఆకాశం వైపు చూసాడు. గత వారం రోజుల వర్షంతో నెలంతా చిత్తడి గా ఉంది. మేఘాల బాగా కమ్ముకొని కొంచెం చీకటిచేసాయి. వర్షం పడటం లేదు. అదోవిధమైన, మాటలకందని నిశ్శబ్దం. దీనినే ఏమో

'కాల్మ్ బిఫోర్ ది స్టార్మ్' అంటారు అనుకున్నాడు విశ్వం. మరో ఆరు గంటలలో తుఫాన్ ఇంటి మీదపోబోతున్నది, అంటే నమ్మ శక్యం కావటం లేదు.

అంత మంది పోలో మని ఊరు వదిలి పోయినప్పుడు, తాను తీసుకున్న నిర్ణయం సరి నేనా అని ఓ నిమిషం సందేహ పడ్డాడు విశ్వం. మళ్లీ నిర్ణయం తీసుకోవడానికి దోహద పడిన కారణాలను సింహావలోకనం, చేసుకున్నాడు. తాను తీసుకున్న నిర్ణయం సరి నే అనిపించింది. ఆలోచనలు కట్టబెట్టి, మళ్లీ ఇంట్లోకి వెళ్ళాడు విశ్వం.

డ్రాయింగ్ రూమ్, కిచెన్ కలిసే ఉన్నాయి. అలాంటి ఓపెన్ ఫ్లోర్ ప్లాన్ ఉన్న ఇల్లు కావాలనే చూసి కొన్నాడు. హోసే స్టౌ ముందు నిలబడి సీతకు, జెన్నిఫర్ లకు ఏదో చెప్తున్నాడు.

సీత విశ్వం ను చూసి, 'హోసే సమీలు ప్రమాదం గా సేస్తాడట,' అంటూ ఆనందంగా చెప్పింది.

హోసే లంచ్ కని కొన్ని రిసీపులు చెప్తున్నాడు.

సీతకు టాకో సలాడ్ అంటే ఇష్టం. విశ్వకి ఫేహితాలు.

ఇద్దరికి కొంచెం కారంగానే ఉండాలి.

హోసేమిగిలిన వారు కూరగాయలు కట్ చేయడం వంటి పనులతో సహాయపడుతుంటే వంటముగించేసాడు. సీత కొన్ని అప్పడాలు వేయించి, పెరుగు, ఆవకాయ ఫ్రీజర్ లో నుంచి తీసింది. బాస్మతి రైస్ కుక్కర్ లో వేసిఅన్నం వండింది. మొత్తం మీద ఆ ఫ్యూషన్ లంచ్ అందరికి తెగ నచ్చేసింది.

లంచ్ తరువాత అందరూ టి వి ఎదురుగా కూర్చున్నారు. అప్పుడప్పుడు టీవీ ని చూస్తున్న, కళ్ళప్పగించి ఎవరూ చూడడం లేదు. పిల్లలు టాటూ, టాటూ అంతో సీత చేత గోరింటాకు పెట్టించుకు న్నారు. జెన్నిఫర్ మెక్సికో లో తన చిన్ననాటి విషయాలు చెప్తుంటే ఆసక్తితో విన్నది సీత. జెన్నిఫర్ అనుభవాలకి, తన అనుభవాలు కూడా ఎంత దగ్గిరగా ఉన్నాయో సీత తన బాల్య స్మృతులు గుర్తు తెచ్చుకుంటూ , చెప్పింది. జెన్నిఫర్ తను మళ్లీ కమ్యూనిటీ కాలేజి కోర్సులేమైన చేస్తే బాగుంటుందంటే, ఆవిడ అభిరుచులు కనుక్కుని, నర్సింగ్ కోర్సులు చేయమని, కొన్ని కాలేజీల అప్లికేషన్ వివరాలు, గూగుల్ లో వెదికి, జెన్నీఫర్ కు టెక్స్ట్ చేసింది.

విశ్వంకు కూడా తన విషయాలు , గొప్పలు చెప్పడం కంటే, ఇతరుల గురించి తెలుసుకోవడం, వీలైతే సహాయ పడడం ఇష్టం. మాటలలో హోసే చాలా రకాల పనులు, ఇంటి కప్పులు వేయడం నుంచి, గడ్డి కత్తిరించడం , ల్యాండ్ స్కేపింగ్, చిల్లర కాంట్రాక్ట్ పనులు చేశాడని తెలిసింది. ఈ నిలకడ లేని పనులతో పెద్దగా డబ్బులు మిగల్చలేదని అర్ధం అయ్యింది. తను పెట్టుబడి ఉంటే ప్రతీ నెలా గడ్డి కేసి, ఎరువులు వేసే లాన్ మెయింటెనెన్స్ కంపనీ పెట్టాలి అని కోరిక అన్నాడు. విశ్వం మాటల్లోనే దగ్గరున్న స్క్రిబ్లింగ్ పాడ్ తీసుకుని, కంపెనీ ఎలా ఇంకార్పొరేట్ చేయాలి, చిన్న బిజినెస్ కు ఎంత పెట్టు బడి ఉండాలి, కాష్ ఫ్లో లు వ్రాసి ఇచ్చాడు.

బయట తుఫాను ఉధృతం పెరిగినట్లుంది. టి వి, తమ సంభాషణల కు బాక్ గ్రౌండ్ గా గాలి ఆటు పోట్లు తనకు ఓ లయ ఉన్నట్లు ఘోషిస్తున్నది. సాయంత్ర ఆరు కంతా, తుఫాను నగరం పైకి వచ్చేసింది. పిల్లలు ఆకలి అంటే, వెరైటీ గా ఉంటుందని, హోసే తన ట్రక్ లోనుంచి గ్యాస్ గ్రిల్ తీసి, చికెన్, కూరగాయలు గ్రిల్ చేసి వేడి వేడిగా వడ్డించాడు.

రాత్రి పది అయ్యింది. పిల్లలు టీవీ ఎదురుగానే బొంతలు వేస్తే, వాటి మీద పడుకొని నిద్ర పోయారు. జెన్నిఫర్, సీత, హోసే, విశ్వంలు నెట్ఫ్లిక్స్ లో సినిమాలు చూస్తూ, మధ్య మధ్యలో లోకల్ టి వి వాతావరణ చానెల్స్ చూస్తూ ఉంటే సమయం గడవడం తెలీలేదు. ఉన్నటుండి బయట హోరు పూర్తిగా ఆగిపోయింది. టి వి లో స్టార్మ్ ఐ నగరం మీద పోతున్నది అని ఆ నిశ్శబ్దానికి వివరణ ఇస్తున్నారు. విశ్వం హోసే లు తలుపు తెరిచి బయటకు వెళ్లారు. నిజమే వర్షం పూర్తిగా ఆగిపోయింది. వివరించలేని, అంతకు ముందెప్పుడు అనుభవించని నిశ్శబ్దం. సీత జెన్నీఫర్లను కూడా ఓ నిమిషం బయటకు వచ్చి అంతే ఆశ్చర్య పడ్డారు. ఇంట్లోకి వెళ్లినా ఎవ్వరికీ నిద్ర పట్టడం లేదు. తుఫాను మొత్తం దాటి పోయేంతవరకు ఈ టి వి ముందే గడుపుదామని ఒకరికొకరు చెప్పుకోకుండానే డిసైడు అయ్యిపోయారు. తుఫాను అంతా దాటిపోయింది ఇంక ఏమి ప్రమాదం లేదు అనే సరికి తెల్లవారు జాము మూడు గంటలు అయ్యిపోయింది. హోసే కి, జెన్నిఫర్ లకు బెడ్ రూమ్ చూపెట్టి, టి వి ఆపేసి, విశ్వం సీతలు కూడా తమ మాస్టర్ బెడ్ రూమ్ వెళ్లి పడుకున్నారు. పిల్లలు టి వి గదిలో అప్పటికే పడుకొని ఉండడంతో వారిని డిస్టార్బ్ చేయలేదు.

పొద్దున లేస్తూనే ఇంట బయట ప్రశాంతంగానే ఉంది. బయట వర్షం కూడా ఆగిపోయింది. ఫోన్ తీసి చూస్తే చాలా వాట్స్ అప్, టెక్స్ట్ మెసేజిలు కనిపించాయి. అందరూ తమ ఇల్లు ఎలా ఉందో చూసి చెప్పమని ఎంతో ఆదుర్తతో రాసు కొన్న విన్నపాలే. కొంతమంది తో పెద్దగా పరిచయం కూడా లేదు. విశ్వం అలా చూద్దామని తమ కమ్యూనిటీ చుట్టూ మెల్లగా తిరిగి అడిగిన వారి ఇళ్ల ఫోటోలు తీసి, ఏమి కాలేదని వాళ్లకు ఊరట సమాధానాలు పంపించాడు. కమ్మునిటీ కొత్తది కావడంతో అన్ని ఇళ్లు దృడంగా ఉన్నాయి. మొత్తం కమ్యూనిటీ తిరిగే సరికి అర గంట పట్టింది. హోసే గరాజి లో ఎదో పని చేస్తున్నాడు. చూస్తే, గోడ వైపు ఓ కొత్త పెగ్ బోర్డ్. విశ్వం తను గరాజిలో అక్కడ, ఇక్కడ పడేసిన పని ముట్లు అన్ని నీట్ గా ఆ పెగ్ బోర్డ్ మీద సర్దు తున్నాడు. అబ్బే ఇదంతా ఎందుకు చేసావు అంటున్న విశ్వం తో, మీరెంతో సహాయ పడ్డారు, ఈ చిన్న చిన్న పనులు ఇక మీదట కూడా నా మీద వదిలేయండి అని హోసే ఆప్యాయత తో అన్నాడు.

తమ ట్రైలర్ ఇల్లు ఎలా ఉందో అని హోసే వారి కుటుంబం బ్రేక్ఫాస్టు కూడా చేయకుండా వెంటనే బయలు దేరారు. సీత, పిల్లలకు అంత తొందరగా విడి పోవడం కష్టం అనిపిస్తున్నది అని ఇట్టే తెలుసిపోతున్నది. మళ్లీ తీసు కొస్తామన్న ప్రామిస్ తో హోసే వాళ్ళని సీత నుంచి విడ దీయగలిగాడు.

విశ్వం, సీతలు 'డాలి' మ్యూజియం రెస్టారెంట్ లో కూర్చున్నారు. బయట వరుసగా నాటిన పామ్ చెట్లు, అటు తరువాత బీచి, బీచి మీద ఆడుకుంటున్న పిల్లలు, టానింగ్ కని కొండ చిలువల లాగా కదలకుండా పడుకున్న మనుష్యులు, పచ్చల రంగులో సముద్రం పైన నీలాకాశం, అక్కడక్కడ తిరుగుతున్న అతి తెల్లని పిల్ల మేఘాలు – రెస్టారెంట్ అద్దాల గోడలో నుంచి కనిపిస్తూ తామూ బీచ్ ముందే కూర్చునట్లని పిస్తున్నది. ఇదే నీరు, గాలి, మేఘాలు ఓ రెండు నెలల క్రితం ఇర్మా రూపంలో బెంబేలు ఎతించేసాయి అంటే నమ్మబుద్ది కావటం లేదు.

ఈ రెండు నెలలోను సీత విశ్వంలో మంచి మార్పులే తెచ్చాయి. మనకు సహాయం చేయాలని పించినా, తోడు కావాలనుకున్న ఈ ప్రపంచం పెద్దది. ప్రయత్నిస్తే మనకు నచ్చిన పని, మనుష్యులు దొరుకుతారు. అలా ఆలోచించి, సీత, విశ్వం లు 'మీల్స్ ఆన్ వీల్స్' ప్రోగ్రాం లో చేరారు. ప్రతీ ఆదివారం మీల్స్ ప్యాకెట్లు ఓ సెంటర్ లో తీసుకొని, వాన్ లో పెట్టుకొని, ఇంట్లోనుంచి కదల లేని వారికి అందజేయడం. ఎక్కువమంది బాగా వయస్సు మళ్ళిన వారు. అలానే ఇద్దరికి పెయింటింగ్ అదీ సర్రియల్ ఆర్ట్ అంటే ఇష్టం కాబట్టి సాల్వడర్ డాలి మ్యూజియం లో మెంబర్లుగా చేరారు. మెంబెర్స్ కని, మ్యూజియంలో ఏవో కార్యక్రమాలు ఎప్పుడూ జరుగుతూనే ఉంటాయి. ప్రస్తుతం 'డాలి' , 'ఎల్సా' తో చేసిన ఫాషన్ డిజైన్ లు పారిస్ నుంచి మ్యూజియమ్ కు రావడం తో, చూడ్డానికి వెళ్లారు.

ఈ మార్పులతో సమయం ఎలా గడిచిపోతున్నదో తెలియటం లేదు. చాలా మంది కొత్త వారితో, అందులో కొందరు నచ్చిన వారితో పరిచయం అయ్యింది. ఎప్పుడూ తొందరలో ఉండే వనిత తుఫాను తరువాత ఓ సాయంత్రం వచ్చి తాము ఎలా తిరుగు ప్రయాణంలో ట్రాఫిక్ జాంలో గంటల కొద్దీ హైవే లో ఇరుక్కుపోయామో, మరొకరు గ్యాస్ కని ఎంత ఇబ్బంది పడ్డారో , జాక్సంవిల్లే కు పోయిన వారు అక్కడెలా నీటి వరదల్లో చిక్కుకున్నారో అంటూ కథలు కథలుగా చెప్తుంటే , పిల్లల నుంచి ఫోన్ అంటూ సీత, వనిత మాటలు పూర్తి గా వినకుండానే, ఇంట్లోకి వెళ్ళిపోయింది. ఎప్పుడూ 'ఇరు మా' అనే సీత నోట, మళ్లీ ఆ మాటలు విన లేదే అని కొన్ని క్షణాలు నిచ్చేష్ట అయ్యింది వనిత.

లంచ్ కని ఆర్డర్ చేసిన 'తపస్' ముగించి హెజెల్ నట్ ఫ్లేవర్డ్ కాఫీ తాగుతుండగా, సీత ఫోన్ వైబ్రేట్ అయ్యింది. జెన్నిఫర్ నుంచి కాల్. పిల్లలు ఫ్లోరా, ఫియోనాలు రమ్మంటున్నారని వీలైతే వీకెండ్ ఇంటికి వచ్చి పొమ్మని అడిగింది. తుఫాను తరువాత కూడా పిల్లల వల్ల సీత జెన్నిఫర్లు, విశ్వం హోసే లు తరచుగానే కలిసే వారు. సీత ఇంటికి వెళ్లే దారిలో వాళ్ళింటికి వచ్చి కొంత సేపు ఉండి పోతామని చెప్పింది.

హోసే వాళ్ళ ట్రైలర్ పార్క్ ఇంటి దగ్గర దారిలోనే ఉంది. వీళ్ల పార్క్ నీట్ గానే ఉంది. అక్కడక్కడ గడ్డి పిచ్చిగా పెరుతుండడం, కొన్ని ట్రయిలర్ ఇండ్లముందు జంక్ అది ట్రైలర్ పార్క్ అని చెప్పకనే చెప్తున్నాయి. హోసే ట్రైలర్ ఓ పెద్ద బస్ పొడవుంది. ఒక వైపు కిచెన్ కం డైనింగ్ మరో వైపు ఓ బెడ్ రూమ్. మధ్యలో ఓ వైపు సోఫాలు, టీవీ లు ఉన్నాయి. మధ్య హాలు లోనే బెడ్రూం అనుకొని పిల్లలకు ట్విన్స్ కని బంకర్ బెడ్స్ వేశారు. సీతను చూస్తూనే పిల్లలు పరిగెత్తి వచ్చి హగ్ చేసుకున్నారు. విశ్వం, హోసే లు కూడా జెన్నిఫర్ తో బాటు హాల్లోనే కూర్చుని కబుర్లు చెప్పుకోవడం మొదలెట్టారు. జెన్నిఫర్ కంమ్యూనిటీ కాలేజీలో చేరింది. హోసే కూడా జెన్నిఫర్ కాలేజి ముగించిన తరువాత తను చేరుతానని, ప్రస్తుతం విశ్వం సలహాల వల్ల కాష్ ఫ్లో బాగుందని చెప్పాడు. సీత తాను పిల్లల దగ్గర స్పానిష్ పదాలు నేర్చుకోవాలనడంతో, పిల్లలు సీత భాష మాటలను గురించి ఆసక్తి పెంచుకున్నారు. కొని పదాలు సీత మాట్లాడినట్లే మిమిక్ చేసి అందరిని నవ్వించే వారు. ఓ గంట సమయం అట్టే గడిచిపోయింది. విశ్వం , సీతలు బయలుదేరుదామని లేచారు. పిల్లలకి సీతతో ఇంకా కొంతసేపు గడపాలని ఉందని వాళ్ళ కళ్లలోనే తెలుస్తున్నది. సీత వీడ్కోలు తీసుకుంటూ ఇద్దరి పిల్లలని ఒకేసారి దగ్గర తీసుకొని హగ్ చేస్తుంటే, సీత రెండు చెవులు చెరి ఒకరు పంచుకొని, సీతకు మాత్రం వినపడేలా ముక్త కంఠం తో రెండు పదాలు గుస గుస లాడుతూ చెప్పారు

'ఇరు మా...'

COMMENTS